మహిళల సంక్షేమానికి పెద్దపీట

కంటోన్మెంట్/మారేడ్‌పల్లి, మార్చి 7: మహిళల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట వేస్తున్నదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కంటోన్మెంట్లోని మడ్‌ఫోర్డ్‌లో నూతనంగా నిర్మించిన సఖీభవన్‌ను ఆంధ్ర, తెలంగాణ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ రాకేష్ మనోచా, కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ అధికారి సోమశేఖర్, సీఈఓ మధుకర్‌నాయక్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33% శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత మోదీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అనంతరం బోర్డు సీఈవో మధుకర్ నాయక్ మాట్లాడుతూ రక్షణ శాఖ ప్రత్యేక చొరవ తీసుకొని మహిళల సంక్షేమం కోసం సఖీ భవన్‌ను నిర్మించిందని తెలిపారు. ఒంటరిగా ఉంటూ ఉద్యోగాలు చేసుకునే మహిళలకు, ఇతర ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చిన మహిళలకు ఈ భవన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ భవన్‌లో మహిళలకు వసతి తో పాటు వైద్య సేవలను సైతం అందించనున్నామని ఆయన వివరించారు. వసతి గృహంలో ఉండే మహిళలకు 12 ఏండ్లలోపు పిల్లలు ఉంటే వారి ఆలనా పాలన చూసుకునేందుకు ఒక కేర్ టేకర్‌ను సైతం నియమిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్, కంటోన్మెంట్ బోర్డుకి సంబంధించిన ఆయా విభాగాల అధికారులు గోపాల కృష్ణ దాస్, బాలకృష్ణ, మహేందర్, దేవేందర్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సఖీభవన్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రక్షణ శాఖ అధికారులు రాకేష్, సోమశేఖర్ తదితరులు

రూ.5 కోట్ల వ్యయంతో పార్కుల అభివృద్ధి

అన్ని హంగులతో పార్కును అభివృద్ధి చేసి కాలనీ వాసుల కోసం అందుబాటులోకి తీసుకొచ్చిందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ ఐదో వార్డు మహేంద్రాహిల్స్‌లో రూ.5కోట్ల వ్యయంతో నాలుగు వేల చదరపు గజాలలో సకల సౌకర్యాలతో నిర్మించిన కంటోన్మెంట్ ఉద్యాన్ పార్కును గురువారం బోర్డు ప్రెసిడెంట్ కె. సోమశేఖర్, సీఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యుడు జే. రామకృష్ణ లతో కలిసి కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పార్కులో ఓపెన్ జిమ్ ,చిల్డ్రన్ పార్కు ,స్కేటింగ్ స్టేడియం ,వాకింగ్ ట్రాక్, పచ్చదనం కలిగిన మైదానం స్థానిక ప్రజలకోసం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం

తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తేజ్‌పాల్

బొల్లారం,మార్చి 7: కంటోన్మెంట్ ఏడో వార్డు పరిధిలోని న్యూ గాంధీనగర్‌లో గురువారం తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు తేజ్‌పాల్ మాట్లాడుతూ.. దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత గడిచిన రెండు నెలల క్రితం బస్తీలో మంచి నీటి పైపులైన్ విషయమై బోర్డు సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు.ఈ విషయమై బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ సానుకూలంగా స్పందించి గురువారం మంచి నీటి పైపులైన్ పనులను ప్రారంభించడంతో బస్తీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సెల్వీ, బుజ్జి,రజినా,జోజి,ఫిలోమెనా, జైహింద్ తదితరులు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన

మహా శివరాత్రి సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఎస్ఆర్‌నగర్ విభాగం ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ గ్రౌండ్ ఎదురుగా ఉన్న రాజయోగ మెడిటేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగ దివ్య దర్శన ప్రదర్శనను జలమండలి సీజీఎం ఎం.ప్రభు గురువారం ప్రారంభించారు. దేశ నలుమూలల ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలను ఒకే చోట ఏర్పాటు చేయడంతో వాటిని దర్శనం చేసుకునే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తారని సీజీఎం ప్రభు పేర్కొన్నారు. – అమీర్‌పేట్,

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు

లష్కర్‌ను జిల్లాగా ప్రకటించాలి

సికింద్రాబాద్,మార్చి7: లష్కర్‌ను జిల్లాగా ప్రకటించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో పాటు సికింద్రాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌లను సాధన సమితి సభ్యులు గురువారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో అనుసంధానంగా ఉన్న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని కొత్తగా లష్కర్ జిల్లాగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి బాలరాజ్ యాదవ్, ఉపాధ్యక్షులు శైలెందర్, సభ్యులు సునీల్‌ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, జగ్గయ్య, కృష్ణముదిరాజ్, అజిజ్, సాగర్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు

ఖాళీ ప్రదేశాల్లో చెత్త లేకుండా చూడాలి

జీహెచ్ఎంసీ చీఫ్ ఎంటమాలజిస్ట్ రాంబాబు

బన్సీలాల్‌పేట్, మార్చి 7 : దోమల నివారణలో ప్రజలు కూడా సహకరించాలని జీహెచ్ఎంసీ చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ ఏ.రాంబాబు అన్నారు. గురువారం భోలక్‌పూర్, నగర్ బస్తీలలో ఆయన పర్యటించారు. బేగంపేట్, సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో సిబ్బంది చేపట్టిన చర్యలను ఆయన పరిశీలించారు. జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ద్వారా ప్రతిరోజూ తమ సిబ్బంది ఇంటింటికీ తిరిగి దోమల మందు పిచికారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారానికి ఒకసారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి కొంత సమయం కేటాయించాలన్నారు. అదేవిధంగా పాత టైర్లు, వాడని కూలర్లు, కొబ్బరిబొండాలు, పాత్రలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో పిచికారీ చేయాలని ఎంటమాలజీ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్ రాజేందర్ రెడ్డిలను ఆదేశించారు. ఫీల్డ్ సిబ్బంది రాజేశ్వర్, సాయికుమార్‌లు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న చీఫ్ ఎంటమాలజిస్ట్ ఏ. రాంబాబు

కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేయాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 7: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను తక్షణమే క్రమబద్ధీకరణ చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేయాలనే డిమాండ్‌తో యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్ట్ – తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో ఓయూలో గురువారం మహా సదస్సును నిర్వహించారు. ఓయూ టెక్నాలజీ కళాశాల ఆడిటోరియంలో డాక్టర్ ఎ. పరుశురాం అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ హరగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దీనిని సామాజిక న్యాయంలో భాగంగా చూడాలని సూచించారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ రమా మెల్కోటే, కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘాల నాయకులు డాక్టర్ రామేశ్వర్, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ ధర్మతేజ, అసోసియేషన్ నాయకులు డాక్టర్ ఎం. జితేందర్‌రెడ్డి, డాక్టర్ ప్రేమయ్య, డాక్టర్ భూమయ్య, చేగుంటి రవికుమార్, డాక్టర్ సాదు రాజేశ్, డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ వినీత పాండే, డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ తిరుపతి, డాక్టర్ శివా రెడ్డి, డాక్టర్ సురేశ్, డాక్టర్ రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాన్ని అందిపుచ్చుకోవాలి

సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 7: నూతన విద్యావిధానాన్ని అందిపుచ్చుకోవాలని సరోజినీ నాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయ చైర్మన్ డాక్టర్ బి. ప్రభాశంకర్ అన్నారు. విద్యావ్యవస్థలో మార్పులతోనే పురోగతి సాధ్యమవుతుందన్నారు. విద్య అనేది ఆయుధమని, విద్యార్జనలో ఎక్కడా వెనుకపడవద్దని సూచించారు. నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డేను పురస్కరించుకుని తార్నాకలోని సరోజినీ నాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయంలో జాతీయ విద్యావిధానం అమలు కోసం సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభాశంకర్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు వి. రాజమౌళి, ఎల్. ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణ, రఘురామారావు, డాక్టర్ శ్రీనివాస్ ఆరుట్ల, అజయ్ పాండే, ఏవీ శ్రీకాంత్, ఎం. వెంకటరమణ, సీహెచ్ కృష్ణమోహన్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో విద్యలో చాలా మార్పులు వచ్చాయన్నారు. అందుకనుగుణంగా వనితా కళాశాలను సైతం అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాయినాథ్, దయాకర్, డైరెక్టర్ శ్రీనివాస్, సరిత, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలి

మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, అధ్యాపకులు

బన్సీలాల్‌పేట్, మార్చి 7 : పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.హేమలత మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలన్నారు. విద్య ద్వారానే అది సాధ్యమవుతుందన్నారు. సమాజం నుంచి సమాన గౌరవాన్ని ఆశించే మహిళల పట్ల జరిగే వివక్ష, హింసను సహించకూడదన్నారు. ఏదైనా సమస్య ఉంటే ఐక్యంగా పోరాడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అమర్నాథశర్మ, ఎన్ఎస్ఎస్ అధికారులు బి.రాజశేఖర్ రెడ్డి, కే.బాబు, పరిపాలనాధికారి రాహుల్, మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వంతో.. వైఎంసీఏ ఎంఓయూ

నాగాలాండ్ లో ఎంఓయూ ప్రతాలను మార్చుకుంటున్న దృశ్యం

మారేడ్‌పల్లి, మార్చి 7: ఈశాన్య రాష్ట్రమైన నాగాలాండ్‌లోని వివిధ సేవా కార్యక్రమాల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వంతో గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్ కుదుర్చుకుంది. ఈ మేరకు ఢిల్లీ విగ్యాన్ భవన్‌లో జరిగిన ఈశాన్య ప్రాంతాల పర్యాటక, సాంస్కృతిక అభివృద్ధి శాఖ మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో ఆ శాఖ అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమ ంలో గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ ప్రధాన కార్యదర్శి లియోనార్డ్ మైరిన్ పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

మారేడ్‌పల్లి/అమీర్‌పేట్, మార్చి 7: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మోండా డివిజన్‌లోని పలు ఆలయాలు వేడుకలకు సర్వం సిద్ధమయ్యాయి. ఈ నెల 8న మహా శివరాత్రి సందర్భంగా రెజిమెంటల్ బజార్‌లోని శ్రీ కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ మహేందర్ గౌడ్ తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రాతకాల అభిషేకం, 7:30 నుంచి 8 గంటల వరకు అభిషేకము, రాత్రి 9 గంటలకు శివ కళ్యాణం, సామూహిక కల్యాణం, రాత్రి 10:30 గంటలకు లింగోద్భవకాల అభిషేకములు నిర్వహించనున్నట్లు తెలిపారు.అదేవిధంగా సికింద్రాబాద్ గణపతి ఆలయం ,మారేడ్‌పల్లి లోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, మహేంద్రా హిల్స్‌లోని శివాలయంలో ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

రెజిమెంటల్‌బజార్‌లోని శ్రీ కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో కొలువుదీరిన స్వామి

'శివోహం' రాగజాగరణ నేడు

మహాశివరాత్రిని పురస్కరించుకుని నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో వై8 టీవీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 'శివోహం' పేరుతో రాగజాగరణ జరుగుతుందని సంస్థ సీఈవో భాష్యం మధుమోహన్ తెలిపారు. ఈ రాగజాగరణ శుక్రవారం సాయంత్ర 6 నుంచి శనివారం ఉదయం 4 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. వేలాది మంది భక్తులతో కలిసి శివ నామస్మరణతో భక్తి రాగ, నృత్యాలతో నిర్వహించే ఈ రాగజాగరణను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహించే ఈ కార్యక్రమానికి పీఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు, కవులు, కళాకారులు, సామాజిక, రాజకీయ, వ్యాపార ప్రముఖులు విచ్చేస్తున్నారని తెలిపారు.

రేపు గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

ఖైరతాబాద్, మార్చి 7 : గ్లోబల్ ట్రీ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ అండ్ ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో ఈనెల 9న బంజారాహిల్స్‌లోని హయత్ ప్యాలెస్ హోటల్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకర్ ఆలపాటి తెలిపారు. సోమాజిగూడలోని గ్లోబల్ ట్రీ సంస్థలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విదేశాల్లో విద్యనభ్యసించాలనుకునే వారికి సరైన అవగాహన లేక ఇబ్బందులు పడుతుంటారని, వారికి నేరుగా విదేశాలకు సంబంధించిన యూనివర్సిటీ ప్రతినిధులతో సంప్రదించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఎలాంటి వీసా రుసుం ఉండదని, ఉచితంగా ఐఈఎల్‌టీఎస్‌లో శిక్షణ అందిస్తామని, లక్కీడిప్ ద్వారా ఉచిత విమాన టికెట్ సైతం గెల్చుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈఫెయిర్‌లో ఉచితంగా పాల్గొనే అవకాశమిస్తున్నామన్నారు.ఫెయిర్‌ను మాజీ మంత్రి, మేడ్చల్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రారంభిస్తారన్నారు. అనంతం ఫెయిర్‌కు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు.

మోసపోకూడదనే..ఫిర్యాదు

భూగర్భ జలవనరుల శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ రిజిస్టర్డ్ హైడ్రో జియాలజిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 7: కనీస విషయ పరిజ్ఞానం లేకుండా బోర్ పాయింట్లు చూపిస్తామని చెబుతూ ప్రజలను మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రిజిస్టర్డ్ హైడ్రో జియాలజిస్ట్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు భూగర్భ జల వనరుల శాఖ డైరెక్టర్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమావత్ హరి మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో భూగర్భ జల వనరులు అడుగంటాయని అన్నారు. దీనిని అవకాశంగా తీసుకున్న కొంత మంది మోసగాళ్లు ఎటువంటి సాంకేతికత , కనీస పరిజ్ఞానం లేకుండా బోర్ పాయింట్లు చూపిస్తున్నారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం బోర్ పాయింట్లు చూసే అర్హత కేవలం రిజిస్టర్డ్ హైడ్రో జియాలజిస్ట్‌లకు మాత్రమే ఉందని చెప్పారు. వేలల్లో సొమ్ము తీసుకుని బోర్ పాయింట్లు చూపెడుతున్నారని, లక్షలు ఖర్చు చేసి, బోర్లు వేసినా నీరు పడక ప్రజలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలువురు ప్రజలు తమ దృష్టికి తీసుకురాగా ప్రజలు మోసపోకూడదనే ఉద్దేశంతో ఫిర్యాదు చేస్తున్నట్లు వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సర్క్యూలర్ పంపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సలహాదారు డాక్టర్ జి. మశ్చెందర్, ప్రతినిధులు డాక్టర్ పబ్బు శ్రీను, డాక్టర్ అల్లం ఏడుకొండలు, పూల కారం విష్ణు, రాయల నందగోపాల్, నాగ రాజు, కర్ణాకర్, తిరుపతి పాల్గొన్నారు.

9,10 తేదీల్లో నీటి సరఫరా ఉండదు

చిక్కడపల్లి, మార్చి 7 : గాంధీనగర్ డివిజన్ పరిధిలో 9, 10 తేదీల్లో తాగునీటి సరఫరా ఉండదని వాటర్ వర్క్స్ గాంధీనగర్ మేనేజర్ కృష్ణ మోహన్ తెలిపారు. నగరానికి ఉస్మాన్ సాగర్ నుంచి మంచినీటి సరఫరా చేసే నీటి కాలువకు హకీంపేట ఎంఈఎస్ వద్ద భారీ లీకేజీ ఏర్పడింది. శనివారం ఉద యం 6 నుంచి ఆదివారం అర్ధరాత్రి 12 వరకు మరమ్మతులు చేపడుతున్నారని, దీంతో గాంధీనగర్, దోమలగూడ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఉండదన్నారు.

భవిష్యత్ తరాల కోసం డ్రైనేజీ ప్రక్షాళన

■ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, మార్చి 7: అంబర్‌పేట నియోజవకవర్గ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరి స్థానికులను వేధిస్తున్న డ్రైనే జీ సమస్యను పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించి భవిష్యత్ తరాలకు అనుగుణంగా పైప్‌లైన్ల ప్రక్షాళన చేపడుతున్నామని తెలిపారు. గురువారం అంబర్‌పేట డివిజన్ పటేల్ నగర్‌లో స్థానిక కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలసి రూ.6 లక్షల వ్యయంతో ఏర్పా టు చేస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ... నియోజవకర్గ మౌలిక వసతుల కల్పనలో భాగంగా పలు అభివృద్ధి పనులను వేగవంతం చేశామన్నారు. అభివృద్ధికి నోచుకోని బస్తీల రూపురేఖలను మార్చి ఎలాంటి సమస్యలు లేని ప్రాంతాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థముదిరాజ్‌తో పాటు బస్తీ నాయకులు పాల్గొన్నారు.

పటేల్‌నగర్‌లో డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ముదిరాజ్‌లు హక్కులు సాధించుకోవాలి

హిమాయత్‌నగర్,మార్చి7: రాష్ట్రంలోని ముదిరాజ్ కులస్తులు సంఘటితమై ప్రభుత్వపరంగా వచ్చే హక్కులను సాధించుకోవాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. గురువారం హైదర్‌గూడలో మహాసభ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముదిరాజ్‌లు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వీరి సంక్షేమం, అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని కోరారు.

ఉచిత శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలి

హిమాయత్‌నగర్, మార్చి7: రాష్ట్రంలో వివిధ ఉద్యోగాల కోసం సిద్ధమయ్యే నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ అందించేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గురువారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

వరద ముంపు సమస్యను పరిష్కరించండి

అంబర్‌పేట, మార్చి 7: ఉస్మానియా యూనివర్సిటీ నుంచి మల్లికార్జుననగర్ బస్తీ ద్వారా వెళ్లే వరద ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ ఈఈ పేర్రాజుతో కలిసి మల్లికార్జుననగర్ వాసులు పడుతున్న ఇబ్బందులను అధికారులకు వివరించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శివరాత్రి వేళ ..పండ్లకు భలే గిరాకి

మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో ఉన్న వీరభద్రస్వామి, మహాకాళేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. అలాగే బేగంపేట్‌లోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలోనూ మహాశివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సందడిగా మార్కెట్లు

శివరాత్రి పండగ నేపథ్యంలో భక్తులు ఉపవాసాలు అధికంగా ఉంటారు.. శివుడికి ప్రత్యేక పూజలు అభిషేకాల అనంతరం పండ్లు ఫలహారాలతో ఉపవాస దీక్షలు చేస్తుంటారు. దీంతో పండ్ల మార్కెట్‌లో వివిధ రకాల పండ్ల మార్కెట్‌లు గురువారం కొనుగోలు దారులతో కళకళలాడాయి. ప్రధానంగా మోండామార్కెట్, వీజీ రోడ్డు పండ్ల మార్కెట్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న పండ్ల మార్కెట్‌లు వినియోగదారులతో రద్దీగా కనిపించాయి.

– బేగంపేట్, మార్చి 7: